# అమెరికా దురాక్రమణ యుద్ధం

# రేడియోధార్మికతకు బలౌతున్న ఇరాక్ బాలలు

**మొదటిసారిగా** స్వతంత్ర పరిశోధకులు దక్షిణ ఇరాక్‌లోని ఒకప్పటి అమెరికా వైమానిక స్థావరానికి సమీపాన గల ప్రాంతంలో గుండె జబ్బులు, కాళ్ళు చేతులు సరిగా లేకపోవటం వంటి జన్యుపరమైన సమస్యలతో పిల్లలు పుట్టటాన్ని గుర్తించారు. 2003 అమెరికా దురాక్రమణ తర్వాత ఆ ప్రాంతమంతా అధిక ప్రమాణాలతో కూడిన రేడియోధార్మిక లోహంతో, విషపూరితమైన యురేనియం కాలుష్యంతో నిండిపోయింది. 2016లో దక్షిణ బాగ్దాద్‌లో నసీరియాహ్ నగరానికి సమీపానగల ఒకప్పటి అమెరికా వైమానిక స్థావరమైన తవిల్ ఎయిర్‌బేస్ సమీప గ్రామాల బాలల దంతాలను, వెంట్రుకలను పరిశోధకులు పరీక్షించారు. అణుఇంధనం కొరకు వినియోగించే క్యాన్సర్ కారక తక్కువ రేడియోధార్మికతగల భారీలోహాలైన యురేనియం, థోరియం అధిక ప్రమాణాలలో ఉన్నట్లు వారు గుర్తించారు.

అణువిద్యుత్ పరిశ్రమలో వచ్చే రసాయనిక విషతుల్య ఉప ఉత్పత్తి డిప్లీటెడ్ యురేనియం, డిప్లీటెడ్ యురేనియం క్షీణిస్తూ థోరియం అవుతుంది. ఇరాక్ యుద్ధంలో మొదటి సంవత్సరం ఈ డిప్లీటెడ్ యురేనియాన్ని ఆయుధాలకు జోడించి ఉపయోగించారు. హెచ్చు సాంద్రత కలిగి ఉన్న కారణంగా ఇది ట్యాంకుల సామర్థ్యాన్ని ఇనుమడింపచేస్తుంది. సాయుధ శకటాలను, భారీ ట్యాంకులను చీల్చుకుంటూ బుల్లెట్లు దూసుకువెళ్ళేట్లు అది చేయగలదు. అమెరికా సైనిక స్థావరాలకు వెలుపల వున్న చెత్తకుప్పల్లో నుండి కాల్చివేసిన గుంటల్లో నుండి డిప్లీటెడ్ యురేనియం వాతావరణంలోకి చేరుతుంది.

వైమానిక స్థావరానికి సమీపాన జీవించే వారికి జన్యుపరమైన లోపాలతో కూడిన పిల్లలు పుట్టే అవకాశం ఎక్కువగా వుంటుందని గణాంకాలను విశ్లేషించిన మీదట పరిశోధకులు నిర్ధారణకు వచ్చారు. గుండెజబ్బులతో పుట్టటం, వెన్నుపూసలో లోపాలు, తొర్రి, కాళ్ళుచేతులు లేకపోవటం, ఉన్నా పనిచేయకపోవటం వంటి లోపాలు ఆ పిల్లల్లో కనిపిస్తున్నాయి. ఈ అధ్యయన ఫలితాలు త్వరలోనే పర్యావరణ కాలుష్యం అనే పత్రికలో ప్రచురితం కానున్నాయి. దానిలో వ్యాసకర్తలు అమెరికా దురాక్రమణ యుద్ధం వదలివెళ్ళిన విషతుల్యాలు ఎంతమేరకు ఇంకా కాలుష్యాన్ని కలిగిస్తూ ఇరాక్ ప్రజలను అనారోగ్యాలపాలు చేస్తున్నాయనేది నిర్ధారించ టానికి మరిన్ని పరిశోధనలు జరగాలని పేర్కొన్నారు.

అమెరికా దురాక్రమణ చేసిన 2003 సం॥ తర్వాత కొన్ని సంవత్సరాలపాటు ఇరాక్ వైద్యులు యుద్ధం హెచ్చుగా జరిగిన ప్రాంతాలలో జన్యులోపాలతో పిల్లలు పుట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని హెచ్చరించారు. ఈ విషయానికి సంబంధించిన ఇతర అధ్యయనాలు యుద్ధం ఎక్కువగా జరిగిన ఫల్లాజా వంటి నగరాలలో మృతశిశువుల రేటు, గర్భస్రావాలు, బ్లడ్ క్యాన్సర్, చిన్నపిల్లల్లో క్యాన్సర్ అమాంతంగా పెరిగాయని కనుగొన్నాయి. శాస్త్రవేత్తలు, ఇరాక్ వైద్యులు, అంతర్జాతీయ పరిశీలకులు ఎప్పటి నుండో దీనంతటికీ డిప్లీటెడ్ యురేనియమే కారణమని సందేహిస్తూనే వున్నారు.

ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం అమెరికా సాగించిన వేలాది రౌండ్ల కాల్పుల తర్వాత 2003 సం॥లో 2వేల మెట్రిక్ టన్నుల డిప్లీటెడ్ యురేనియం ఇరాక్ వాతావరణంలోకి చొరబడింది. 1993లో జరిగిన పర్షియన్ గల్ఫ్ యుద్ధంలో కూడా అమెరికా సైన్యాలు, ఇరాక్, కువైట్, సౌదీఅరేబియాలలో డిప్లీటెడ్ యురేనియంతో కూడిన ఆయుధాలతో కాల్పులు సాగించాయి. అమెరికా వేలాది టన్నుల సైనిక సామగ్రిని ఇరాక్‌లోకి దిగుమతి చేసింది. ఇందులో ట్యాంకులు, ట్రక్కులు, బాంబర్లు, సాయుధ శకటాలు, కాల్పులాల ఆయుధాలు, విమానాలను కూల్చివేసే వ్యవస్థలు, శతఘ్నులు, ఫిరంగులు వంటి వెన్నో వున్నాయి. వీటిలో కొన్నింటికి డిప్లీటెడ్ యురేనియంతో కోటింగ్ వేశారు. ఇందులో ఎక్కువభాగం తప్పనిసరిగా మిలటరీ డంపింగ్ యార్డులకు చేరుకుంది. గత అమెరికా సైనిక స్థావరాలవద్ద, దేశవ్యాప్తంగా ఇతర ప్రాంతాలలోను డజన్లకొద్దీ యుద్ధసామగ్రి చెల్లాచెదురుగా పడి వుంది.

డిప్లీటెడ్ యురేనియంను అమెరికా సైనిక స్థావరాలలో నిలవ వుంచినట్లు అది వాతావరణంలోకి నెమ్మదిగా చేరినట్లు కూడా తెలుస్తోంది. తవిల్ వైమానిక స్థావరం–కొత్త అధ్యయనానికి కేంద్రంగా వున్నది. ఇరాక్ మొత్తం విస్తరించి వున్న, అమెరికా మిలటరీ వదిలేసిపోయిన విషతుల్య పదార్థాలు గల అనేక ప్రాంతాల్లో ఇరాక్ ఒకటి.

2003 అమెరికా దాడి తర్వాత ఇరాక్ అధికారులు 300 నుండి 365 డిప్లీటెడ్ యురేనియంతో కలుషితమైన ప్రాంతాలను గుర్తించారని, దీనినంతా శుభ్రం చేయటానికి 30 మిలియన్ల నుండి 45 మిలియన్ల డాలర్ల వరకు ఖర్చవుతుందని 2013లో అంతర్జాతీయ పరిశీలకులు ఒక నివేదికలో తెలియజేశారు.

మిలటరీ కాలుష్యంపై పరిశోధన చేసిన సవాబీ అస్ఫహానీ మారణకాండ ముగిసి, దళాలన్నీ వెళ్ళిపోయాక కూడా కాలుష్యం రూపంలో యుద్ధం తాలూకు హింస ఇంకా కొనసాగుతూనే వుందన్నాడు. జనాభా ఎక్కువగా వున్న ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని వేసిన టన్నులకొద్దీ బాంబులు, కాల్చిన బుల్లెట్లు గాలిని, నీటిని, మట్టిని విషపూరిత వ్యర్థాలతో నింపేశాయి. తరాల తరబడి ప్రజలు కాలుష్య ప్రభావానికి గురయ్యేలా ఆ భూభాగాన్ని విషతుల్యం చేశాయి. ఇరాక్‌లో అమెరికా చేసే యుద్ధం ఇంకా ముగింపుకి రాలేదు. అమెరికా మిలటరీ, ఇరాక్ భద్రతా దళాలకు శిక్షణనిస్తూ, అవి రెండూ కలిసిన కూటమికి నాయకత్వం వహిస్తోంది. ఈ కూటమి ఇటీవలే, అంటే గత వారమే ఐఎస్ఐఎస్ తిరుగుబాటుదార్లపై వైమానిక దాడులు చేసింది. నవాబీ అస్ఫహానీ ఇలా అంటున్నాడు "తాను కలుషితం చేసిన అన్ని ప్రదేశాలకు తానే బాధ్యత పడేట్లుగా, అన్నింటినీ పరిశుభ్రం చేసేట్లుగా అమెరికాపై ఒత్తిడి తేవాలి", "ఇరాక్ వాతావరణంలో నుండి విషవ్యర్థాలను తొలగించి శుద్ధి చేసే క్రమంలో అమెరికా తయారుచేసిన మిలటరీ చెత్తనంతా తొలగించి నాశనం చేయటానికి చాలా కాలం పడుతుంది".

ooo